ఈద్గాలో రంజాన్ ప్రార్థనలు

- హాజరైన పెద్దదర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని బిల్టప్ వద్ద ఉన్న ఈద్గా మైదానంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం ప్రార్థనలకు పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువులు (మౌల్వి) ముఫ్తి న్యామతుల్లా రంజాన్ సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో డిప్యూటీ మాజీ సిఎ అంజాద్ బాషా, దర్గా అమీర్, సీనియర్ నాయకులు సుభాన్‌బాషా, కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ, మహమ్మద్ రఫీ, వివిధ పార్టీల నాయకులు నజీర్ అహ్మద్, అమీర్ బాబు, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, పీస్ స్కూల్ సయ్యద్ గౌస్ పీర్, ఆరీఫుల్లా, సుభాన్ బాష, అఫ్జల్ ఖాన్, గులాం తారీక్, డాక్టర్ అస్గర్ అలీ, అహ్మద్, దస్తగిరి, ముస్లిం మత పెద్దలు హాజరయ్యారు. ప్రార్థనల అనంతరం పలువురు మీడియాతో మాట్లాడారు. ప్రతి ఒక్కరికి శుభం చేకూర్చాలని ప్రార్థనలు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రార్థనలు నిర్వహిస్తున్న పెద్దదర్గా పీఠాధిపతి, ముస్లిమ్ మైనార్టీ నాయకులు

అరటి రైతులకు ఊతమివ్వని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

- అమాంతం పడిపోయిన అరటి ధరలు
- ఎండ తీవ్రతకు కింద పడుతున్న చెట్లు
- భారీగా పెరిగిన రవాణా వ్యయం
- ఆందోళనలో రైతన్నలు

అధిక ఉష్ణోగ్రతలకు విరిగిపోతున్న అరటి చెట్లు

పులివెందులలో ఏర్పాటు చేసిన అరటి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

ప్రజాశక్తి- సింహాద్రిపురం

జిల్లాలో సిరులు కురిపించిన అరటి కాయల ధరలు ప్రస్తుతం అమాంతంగా తగ్గి పోవడంతో రైతులు కుదేలువుతున్నారు. నియోజవర్గంలోని సింహాద్రిపురం, పులివెందుల, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లి మండలాలలో విస్తారంగా 8600 హెక్టార్లు అరటిసాగు చేశారు. ఈ ఏడాది అరటి దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ధర లేకపోవడంతో రైతులు దిక్కులు చూస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసం చివరినాటికి టన్ను అరటికాయలు రూ. 25 వేలు ఉండడంతో చాలామంది రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అప్పట్లో విదేశాలలో అరటికాయలకు విపరీతమైన డిమాండ్ ఉండడంతో ధరలు ఆశా జనకంగా ఉండేవి. ప్రస్తుతం విదేశాలలో డిమాండ్ తగ్గిపోవడంతో పాటు, స్థానికంగా ఉన్న కంపెనీ ఏజెంట్లు సైతం అరటి కాయలు కొనుగోలుకు రాకపో వడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో టన్ను అరటి కాయలు రూ. 5 వేలు నుంచి రూ.12 వేలు లోపల మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అది కూడా మొదటి కోత అరటికాయలకు మాత్రమే. రెండో కోత అరటి కాయలను కొనుగోలుకు వ్యాపారులు సైతం రావడంలేదని రైతులు వాపోతున్నారు.

నిరుపయోగంగా ఉన్న గోడౌన్

ఉష్ణోగ్రతకు కింద పడుతున్న అరటి చెట్లు..

ఇటీవల కాలంలో జిల్లాలో భారీగా ఉష్ణోగ్రత పెరగడంతో అరటి చెట్లు కింద పడిపోతున్నాయి ఎండ తీవ్రతకు తట్టుకోలేక మొక్క మధ్యభాగానికి విరిగి పోతున్నాయని రైతులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రత కారణంగా కాయలు సైతం నాణ్యత లోపించడంతో తక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందని వ్యాపారులు మరోవైపు చెబుతున్నారు.

భారీగా పెరిగిన రవాణా వ్యయం..

జిల్లాలో పండిన అరటికాయలు ఎక్కువ భాగం ఉత్తరాది రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి. గతంలో ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు 20 టన్నులు సామర్థ్యం కలిగిన లారీలు రూ.ఒక లక్ష 20వేలకు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఇదే సామర్థ్యానికి అక్కడికి చేరాలంటే రూ .2 లక్షల పైచిలుకు వరకు లారీ యాజమానులు డిమాండ్ చేస్తున్నారు. దీని కారణంగా అరటికాయలు ధర తక్కువ చేసి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపి రవాణా వ్యయం తగ్గేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్..

గత ప్రభుత్వ హయాంలో పులివెందులలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసిన అది వినియోగంలోకి రాకపోవడంతో ఫలితం శూన్యంగా మిగిలింది. మార్కెటింగ్ శాఖ, పులి వెందుల డెవలప్మెంట్ అథారిటీ (పాడ) ఆధ్వర్యంలో దాదాపు రూ .25 కోట్ల వ్యయంతో నిర్మించారు. అరటికాయలు, చెట్లు, ఆకుల నుంచి బై ప్రోడక్ట్‌ను అత్యాధునిక స్థాయిలో తయారు చేసే విధంగా యూనిట్ ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ గత ఏడాది అప్పటి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం మారిపోవడంతో దాని ఊసే పాలకులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన ఈ యూనిట్ పై ప్రత్యేక దృష్టిసారించి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి..

ప్రస్తుతం మార్కెట్లో అరటికాయల ధరలు అమాంతంగా తగ్గిపోయాయి. పెట్టుబడి వ్యయం భారీగా పెరిగిపోవడంతో ప్రస్తుత ధరలు ఏమాత్రం గిట్టుబాటు కావు. కావున అరటి రైతులను ప్రభుత్వం తగిన ప్రోత్సాహాలు అందించి ఆదుకోవాలి.

-సుబ్బారెడ్డి, అరటి రైతు, గురిజాల.

యూనిట్‌ను వినియోగంలోకి తేవాలి..

గత ప్రభుత్వ హయాంలో ఎంతో ఉన్నత ప్రమాణాలతో నిర్మించిన ప్రాసెసింగ్ యూనిట్‌ను వినియోగంలోకి తేవాలి. దీనివల్ల కొంతమేర రైతులకు లాభం పొందే అవకాశం ఉంది. **- వెంకటరమణారెడ్డి, అరటి రైతు, సింహాద్రిపురం.**

ధరలు తగ్గిన విషయం వాస్తవమే..

15 రోజుల నుంచి అరటికాయలు ధరలు తగ్గిన విషయం వాస్తవమే. డిమాండ్ కంటే దిగుబడి అధికం కావడంతో ధరలు తగ్గినట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరిస్తాం.

- మల్లేశ్వర్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి, ముద్దనూరు.

భగ్గుమన్న భూ వివాదం

- దాయాదుల మధ్య ఘర్షణ
- కత్తులు, గొడ్డళ్లతో పరస్పరం దాడులు
- ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు
- ఐదు బైకులు దగ్ధం

మృతిచెందిన నారాయణరెడ్డి

గాయపడిన జయరామిరెడ్డి

దగ్ధమవుతున్న బైకులు

గాయపడిన మల్లికార్జునరెడ్డి

గాయపడిన సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-బ్రహ్మంగారిమఠం

దాయాదుల మధ్య భూ వివాదం ఘర్షణకు దారి తీసింది. నొకరినొకరు కత్తులు, గొడ్డళ్లతో దాడులు చేసుకున్నారు. ఇరు వర్గాలకు చెందిన ఐదు బైకులును తగులబెట్టారు. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని ముదిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని సోమిరెడ్డిపల్లి పంచాయతీ, ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్ల 159, 160, పొలం విషయమై సోమవారం దాయాదుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ముదిరెడ్డిపల్లి చెరువుకు సమీపంలో పొలం వద్ద ఇరు గ్రూపుల చెందిన వారు ఒకొనొకరు వాదోపవాదాలకు దిగి చివరకు ఘర్షణ పడ్డారు. వెంట తెచ్చుకున్న కత్తులు, గొడ్డళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో చెందిన పెసల నారాయణరెడ్డి (65) అనే వ్యక్తి మృతి చెందారు. ఒక గ్రూపునకు చెందిన పెసల జయరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి మరో గ్రూపునకు శివారెడ్డి, ఆదిలక్ష్మి రక్తపు మడుగులో తీవ్రంగా గాయపడ్డారు. ఇరు గ్రూపులకు చెందిన ఐదు బైకులను దగ్ధం చేసుకున్నారు. గాయపడిన వారు పొలంలో స్పృహ లేకుండా పడిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కొందరిని 108 వాహనంలో, మరికొందరని తమ వాహనంలో చికిత్స నిమితంత ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. ఇదీలా ఉండగా వీరి భూ వివాదం కోర్టులో నడుస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాములోరి కళ్యాణానికి విస్తృత ఏర్పాట్లు

- 5న బ్రహ్మోత్సవాలకు అంకురార్పరణ
- 11న ముఖ్యమంత్రి చంద్రబాబు రాక
- పనుల పరిశీలనలో కలెక్టర్ శ్రీధర్

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్, జెఇఒ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

అత్యంత చారిత్రాత్మక ప్రాశస్త్యం ఉన్న ఒంటిమిట్ట శ్రీకోదండరామాలయంలో ఏప్రిల్ 11న జరిగే శ్రీసీతారాముల కల్యాణానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కల్యాణ వేదిక ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం టిటిడి కల్యాణ మండపం సమీపంలోని పరిపాలన భవన సమావేశ మందిరంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, వైఎస్ఆర్ జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడులతో కలిసి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, టిటిడి అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టిటిడి అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి బ్రహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. 11న జరిగే సీతారాములవారి కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉన్నందున పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు, అత్యంత ప్రముఖులు రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా, టిటిడి, పోలీసు అధికారులు సంయుక్తంగా, నిర్దిష్ట ప్రణాళికలతో విధులను నిర్వర్తించాలన్నారు. కళ్యాణవేదిక ముందు ఏర్పాటు చేసిన ఒక్కో గ్యాలరీకి ఒకరిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామన్నారు. ఎక్కడా కూడా జనం తొక్కిసలాట జరుగకుండా అధికారులు, పోలీస్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రసాదం కౌంటర్ల వద్ద ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కడప, రాజంపేట వైపు నుంచే ఆర్టీసీ బస్సులకు పార్కింగ్, ఇతర జిల్లాలనుంచి ఎన్ని బస్సులు వస్తున్నాయో తెలుసుకుని పక్కాగా ప్లాన్ రూపొందించుకుని పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమిష్టి కృషి చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. టిటిడి జెఇఒ వీరబ్రహ్మం మాట్లాడుతూ టిటిడిలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమిష్టి కృషి చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని అధికారులను కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్యాలరీ వద్ద శ్రీవారి సేవకులను నియమిస్తామన్నారు.

5న బ్రహ్మోత్సవాలకు అంకురార్పరణ

ఈ నెల 5వ తేదీ బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమంతో ప్రారంభమవుతాయని, 6వ తేదీ శ్రీరామనవమి రోజున మొదటి రోజు ధ్వజారోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రారంభం, పోతన జయంతి, కవి సమ్మేళనం, సాయంత్రం శేష వాహన అలంకారం కార్యక్రమాలు జరుగుతాయి. 7న తేదీ వేణు గానాలంకారం, హంస వాహనం, 8న వటపత్ర శాయి అలంకారం, సింహ వాహనం, 9న నవనీత కృష్ణాలంకారం, హనుమత్సేవ. 10న మోహినీ అలంకారం, గరుడసేవ 11న శివదనుర్భంగాలంకారం, సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని, గరుడ వాహన సేవలను అత్యంత వైభవంగా నిర్వహిఒచనున్నారు. శ్రీసీతారాముల కల్యాణానికి ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. 12న రథారోహణం, రథోత్సవం, 13న కాళీయమర్థనాలంకారం, అశ్వవాహనం. 14న చక్రస్నానం, మహాపూర్ణాహుతి, ధ్వజావారోహణం, 15న పుష్పయాగం నిర్వహిస్తారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, పులివెందుల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, టిటిడి సిఇ సత్యనారాయణ, ఎస్ఇలు వేంకటేశ్వర్లు, మనోహర్, టిటిడి డిప్యూటీ ఇఒ నగేష్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, డిఎస్‌పి వెంకటేశ్వర్లు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, సిపిఒ వెంకటరావు, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఇ రమణ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రయివేట్ ఏజెన్సీలు రద్దు చేసి, మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని ఈనెల 1న సిఐటియు అధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కర్, నాగేంద్ర ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మిట్ చేయాలని, ఆప్కాస్ ఏజెన్సీ లాంటి సంస్థలను రద్దు చేయాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పట్టించుకోకపోవడం అన్యాయమని తెలిపారు. ప్రస్తుతం ఆప్కాస్‌ను రద్దుచేసి ఏజెన్సీలకు ఇవ్వాలనే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కనుక ఆప్కాస్, ప్రయివేటు ఏజెన్సీలను రద్దు చేసి పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, మినిమం రూ.26వేల జీతం ఇవ్వాలని తెలిపారు. సమస్యలపై జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల వద్ద ఆందోళన జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి

పోక్సో కేసు నమోదు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి

ప్రజాశక్తి - కడప అర్బన్

బద్వేల్‌లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన కామాంధ ఉపాధ్యాయుడు అన్వర్‌పై పోక్సో యాక్ట్ కేసు నమోదు, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో పనిచేస్తున్న కీచక ఉపాధ్యాయుడు అన్వర్ అదే పాఠశాలలో చదువుతున్న 4వ తరగతి విద్యార్థినిపై అత్యాచారం చేయడం దారుణమని తెలిపారు. విద్యను బోధించాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడడం బాధాకరమని చెప్పారు. దుర్మార్గానికి పాల్పడిన అన్వర్‌పై పోక్సో యాక్ట్ కేసు చేయాలని పేర్కొన్నారు. సంఘటనపై విద్యాశాఖ అధికారులు విచారణ చేసి పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

విభజన హామీల అమలు కోసం ప్రత్యక్ష కార్యాచరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

విభజన హామీల అమలు కోసం ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించినట్లు ఆల్ ఇండియా జై హింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు దశరథరాం రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీల అమలు కోసం పాఠశాలల మూసివేత, ప్రజా ప్రతినిధులను ఘోరావ్ చేయడం, ప్రభుత్వ కార్యాలయాలను మూయించడం, వాహనాలు తిరగకుండా అడ్డుకోవడం, సకల జనుల సమ్మె, నిరాహార దీక్షలు, ధర్నాలు, మిలియన్ మార్చ్ నిర్వహిస్తామని చెప్పారు. శాసనసభలో ప్రత్యేక హోదా తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సి ఆర్ వి ప్రసాద్,నాయకులు పాల్గొన్నారు.

కరువు మండలాలు ఎంపిక

తొమ్మిది తీవ్ర ప్రభావిత మండలాలుగా గుర్తింపు

సాధారణ కరువు మండలముగా మైలవరం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని పది మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు సోమవారం జీవో ఎంఎస్-3ని విడుదల చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలోని రబీ సీజన్‌లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడిన సంగతి తెలిసిందే. అంతకు ముందు ఖరీఫ్ సీజన్ సైతం తీవ్ర దుర్భిక్షం బారిన పడిన నేపథ్యంలో జిల్లా రైతాంగం కుదేలైంది. ఇటువంటి తీవ్ర కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది తక్షణమే కరువు పరిస్థితులను మదింపు నిమిత్తం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. నిపుణుల కమిటీ కలెక్టర్ ప్రభుత్వానికి అందించిన సమాచారాన్ని కూలంకషంగా పరిశీలించింది. అనంతరం జిల్లాలోని 36 మండలాల్లో 10 మండలలాలను తీవ్ర, సాధారణ కరువు మండలాలుగా విభజిస్తూ నివేదిక అందించింది. ఇందులో బాగంగా జిల్లాలోని ఖాజీపేట, మైదుకూరు, తాండూరు, కాశినాయన, దువ్వూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, చాపాడు, మైదుకూరు మండలాలను తీవ్ర కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించింది. దీంతోపాటు మైలవరం మండలాన్ని సాధారణ కరువు ప్రాంతంగా పరిగణించినట్లుగా పేర్కొంది.

రేపు యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో ఈ నెల 2 నుంచి యోగా శిక్షణ కొత్త బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు.ఈ శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్, సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు మూడవ బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. 9848861206, 7013238986 లలో సంప్రదించవచ్చని తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతులు శూన్యం : సిపిఎం

ప్రజాశక్తి- అట్లూరు : పేదలు నివాసం ఉండే గ్రామాల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందిందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. సోమవారం అట్లూరు, ముత్తుకూరు, దేవసాగర్, మద్దూరు, వరికుంట్ల, కోనరాజుపల్లి, తంబలగుంది, బాల్‌రెడ్డిబాయి ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుల చాంద్ బాషా, మండల పార్టీ కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ మండలంలో అనేక గ్రామాలలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. అనేక గ్రామాల్లో శ్మశాన వాటిక లకు ప్రహరీలు వేవని ప్రజలకు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. చాలా గ్రామా లలో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మురుగు కాల్వలు లేక నీరు రోడ్లపై ప్రవహిస్తూ ప్రజలను అనారోగ్యానికి గురిచేస్తోందన్నారు. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అనేక సమస్యలు ప్రజా చైతన్య యాత్ర బృందం దృష్టికి, తీసుకొచ్చారని చెప్పారు. స్మార్ట్ మీటర్లను విద్యుత్ అధికారులు బిగిస్తారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు.కార్యక్రమంలో నాయకులు రవిచంద్ర, స్టీఫెన్, భాస్కర్, యేసు, స్వప్న, మార్తమ్మ, కుమారి, లలితమ్మ, ధనమ్మ, సరోజనమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ భారాన్ని తగ్గించకపోతే ప్రజా ఉద్యమం

ప్రజాశక్తి - బద్వేలు : కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేపడతామని సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తెలిపారు. సోమవారం బద్వేల్ సుందరయ్య భవన్‌లో 'విద్యుత్ షాక్'ల పేరుతో పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా బద్వేల్ పట్టణ కార్యదర్శి కె .శ్రీనువాసులు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెం చడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తె రవేసే టైం ఆఫ్ డే టారీఫ్ విధానాన్ని చిరు వ్యాపా రులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని ఆయన తీవ్రంగా వ్యతిరేకించాచు. రోజు వారీ డిమాఒడ్‌ను బటి ఛార్జీలు విధించే విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఇఆర్‌సి అనుమతించడం దారుణమని ఆయన అన్నారు. సోలార్ విద్యుత్తు యూనిట్ రూ. 1.99 టెండర్లు పడిన రోజుల్లో సెకితో రూ. 2.49 కొంటామని ఒప్పందం చేసుకోవడం సరైంది కాద న్నారు. సెకితో ఒప్పందం చేసుకోవడాన్ని తొలి నుండి సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. సెకితో ఒప్ప ందం వల్ల 25 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రజలు లక్ష కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని, ఇది మో యలేని భారం అవుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అమర్చే కాంట్రాక్టును అదానికి కట్ట పెట్టారని ఆయన విమర్శించారు. ఆదాని కంపెనీ 59, 21, 344 మీటర్లను బిగిం చాల్సి ఉం దన్నారు. ఈ విధానాన్ని అనుమ తించొద్దని సిపి ఎం పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసిందన్నారు.

బండలాగుతున్న ఎద్దు

బండలాగుడు పోటీల్లో విజేత మైదుకూరు ఎద్దు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని పల్లవోలులో అంకాలమ్మ తిరుణాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎద్లచే బండలాగుడు పోటీల్లో మైదుకూరు ఎద్లు విజేతగా నిలిచాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన ఈ పోటీలో తొమ్మిది జతల ఎద్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్ ఎద్లు ప్రథమ స్థానంలో నిలిచి, రూ.లక్ష బహుమతిని గెలుచుకున్నాయి. ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వార్శల గురివిరెడ్డి ఎద్లు రెండవ స్థానంలో రూ.80వేలు బహుమతిని పొందాయి. ప్రొద్దుటూరుకు చెందిన మార్తల వెంకటేశ్వరరెడ్డి ఎద్లు మూడో స్థానంలో రూ.60వేలు గెలుచుకున్నాయి. నంద్యాల జిల్లాకు చెందిన కుందూరు రామభూపాల్‌రెడ్డి ఎద్లు నాలుగో స్థానంలో నిలిచి రూ.40 వేలు బహుమతిని పొందాయి. కమలాపురానికి చెందిన తోట కుమారి ఎద్లు ఐదో స్థానంలో నిలిచి రూ.20వేలు బహుమతిని పొందాయి. మిగిలిన నాలుగు జతల ఎద్లకు ప్రోత్సాహక బహుమతిగా ఒక్కో జతకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచులు మొగిలి రామాంజనేయులు, రామ్మోహన్, మొగిలి రామచంద్రులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

20న రాయలసీమ స్థాయి చర్చావేదిక

ప్రజాశక్తి - చాపాడు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత రాయలసీమ పరిస్థితిపై ఈనెల 20న మైదుకూరులో 'సీమ'స్థాయి చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన వనిపెంటలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రాయలసీమకు తాగు, సాగునీటి ప్రాజెక్టులు, నిరుద్యోగం, యువతకు ఉపాధి అవకాశాల పరిస్థితి, రాజకీయ పార్టీల తీరు అనే అంశంపై రైతు సేవా సమితి ఆధ్వర్యంలో చర్చావేదిక ఏర్పాటు చేశామని జిల్లాలోని రైతులు, రైతు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి కర్నూల్ రాజధానితో మొదలైనప్పటి నుంచి హైదరాబాద్ రాజధానితో కొనసాగి, ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ రాజధానితో తెలంగాణ విడిపోయి, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాయలసీమ ప్రాంతం కొనసాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన ముఖ్యమంత్రులంతా రాయలసీమ ప్రాంతం నుంచి ఎన్నికైనవారేనని తెలిపారు. వీరు రాయలసీమ అభివృద్ధి విషయంలో ఏ ఒక్కరు ప్రాముఖ్యత ఇవ్వలేదన్నారు. గతమంతా హైదరాబాదు అభివృద్ధికి, ప్రస్తుతం అమరావతి, పోలవరం, విశాఖపట్నం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాయలసీమ ప్రజలు, రైతులు, నిరుద్యోగులు రాజకీయాలకు అతీతంగా ఐక్యమై అవగాహన కల్పించుకొని భవిష్యత్ రాయలసీమ అన్న పేరుతో ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవాసమితి మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, రైతు నాయకులు ఆవుల నాగేష్, అక్కిదాసరి రమేష్, పోలయ్య, సుబ్బరాయుడు, బాషా, నాగరాజు పాల్గొన్నారు.

చికెన్, కూరగాయలు అందజేస్తున్న మధుసూదనరెడ్డి

కులమతాలకతీతంగా సాయం

ప్రజాశక్తి - ముద్దనూరు

కులమతాలకతీతంగా తమ సహాయ సహకారాలు అంది స్తున్నామని మండల నాయకులు కటికరెడ్డి మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా మండల సోమవారం మధు సూదనరెడ్డి పెళ్లిరోజును పురస్కరించుకుని ఆయన కుమారుడు యువ నాయకులు కె.గుణవంతరెడ్డి మండల కేంద్రంలోని 600 కుటుంబాలకు చెందిన ముస్లిం, దూదేకుల, పంచాయతీ కార్మికులకు ఇంటికి కిలో చొప్పున చికెన్, పది రకాల కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదనరెడ్డి మాట్లాడుతూ అయిదేళ్లుగా క్రిస్మస్, రంజాన్ పండుగలు పురస్కరించుకుని క్రిష్టియన్లు, ముస్లింలకు చేయూతనిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాగర్‌బాబు, రాజా యాదవ్, ఓబులేసు, నాగరాజు, వినోద్, సుబ్బరాయుడు, గపూర్, దానం, ప్రదీప్, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

వైఎస్.కుటుంబంతోనే సంక్షేమం, అభివృద్ధి

ప్రజాశక్తి - వేంపల్లె

వైఎస్ కుటుంబంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైసిపి మండల అధ్యక్షుడు చంద్రఓబుల్ రెడ్డి, ఉపాధ్యక్షులు మునీర్ బాషా, సర్పంచ్ శ్రీనివాసులు, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కటిక చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక గండి రోడ్డులో ఉన్న వైసిపి కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా జల్ జీవన్ మిషన్ కింద వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సుమారు రూ.480 కోట్లు మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. దాదాపు 90 శాతం పనులు చేపట్టిందన్నారు. తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం 10 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు వేంపల్లి మండలంలో వేసవి కాలం ముందస్తు జాగ్రత్తగా గ్రామపంచాయతీలో 13 తాగునీటి బోర్లు వేయించారని చెప్పారు. అవి ప్రస్తుతం పని చేస్తున్నాయని, అవే లేకపోతే వేంపల్లిలో తాగునీటికి కరువయ్యేదని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఆయా బోర్లలో నీటిమట్టం తగ్గిపోవడంతో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మూడు బోర్లు వేసి ఏదో చేశామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేంపల్లి గ్రామపంచాయతీలో అవినీతి ఆరోపణపై ఇఒ వెంకటసుబ్బారెడ్డి సస్పెండై నెల గడుస్తున్నా ఇంతవరకు ఏ అధికారిని నియమించకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి నేతల ఆధిపత్య పోరుతో ఇక్కడ పనిచేయుటకు ఏ అధికారి ముందుకు రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీలో మురుగు నీరు, చెత్తాచెదారాలు ఓ వైపు, దోమలు మరో వైపు విజృంభిస్తున్నాయని, ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు. ఆదిపత్య పోరును పక్కనపెట్టి సమర్థవంతమైన ఇఒను నియమించి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. నియోజకవర్గంలో పులివెందుల తర్వాత వేంపల్లెను అభివృద్ధి చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కే దక్కుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని ఏ మండలానికి, ఏ ప్రాంతానికి వెళ్లినా తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి శూన్యమని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆది నారాయణ రెడ్డి, దివాకర్ రెడ్డి, సునీల్, బాలాజీ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఆశాజనకంగా ఆరుతడి పంటలు

ప్రజాశక్తి - చాపాడు

రబీలో సాగు చేసిన జొన్న, మినుము, వేరుశనగ, నూగు పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు వరకు రైతులు పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట వివిధ దశలో ఉంది. మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లి, సోమాపురం, విశ్వనాథపురం, బద్రిపల్లి, చియ్యపాడు, సీతారామపురం, అల్లాడుపల్లె, వెంగన్నగారి పల్లె, చెండ్లూరు, రేపల్లె గ్రామాల పరిధిలో 3వేల ఎకరాలలో రైతులు పంటలను సాగు చేశారు. మార్చి చివరికి ఎక్కువ భాగం నూర్పిడికి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. పెసర పంట నూర్పిడి ఇప్పటికే ప్రారంభించారు. కేసీ కెనాల్ పరిధిలో మాత్రం వరి పంట నూర్పిడి తర్వాత నూగు, దోస, మినుము, పెసర సాగును రైతులు చేపట్టారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట దిగుబడి ఆశాజనకం ఉంది. ప్రస్తుతం సాగు చేసిన ఆరుతడి పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు అభిప్రా యపడుతున్నారు. కేసీ కెనాల్ పరిధిలో మార్చి చివరి వరకూ నీరు విడుదల చేస్తారని ముందస్తు సమాచారం లేకపోవడంతో నూగు, పెసర పంటలు సాగు తగ్గింది. ప్రస్తుతం నత్తువలు, మందులు వేస్తున్నారు. దోస కాయల నూర్పిడి కొనసాగుతోంది.

సాగులో ఉన్న మినుము పంట

తాగునీటి ఇబ్బందుల్లేకుండా చేస్తాం

నూతన బోరును ప్రారభిస్తున్న బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చేస్తామని పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని శ్లోక పాఠశాల సమీపంలో, రాజీవ్‌నగర్ కాలనీలో నూతనంగా వేసిన తాగునీటి బోర్లను బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు కొత్త బోర్లు వేసే చర్యలు చేపడుతున్నామన్నారు. వేసవిలో ప్రజలకు నీటిని సకాలంలో సరఫరా చేసేందుకు పంచాయతీ సిబ్బంది పని చేయాలని సూచించారు. నీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ సిబ్బందిపై ఉందన్నారు. వేసవిలో నీటిని వృథా చేయరాదని ప్రజలకు సూచించారు. పంచాయతీల్లో ఎక్కువగా తాగునీటి కోసమే నిధులు ఖర్చు చేయాలని కోరారు. యుద్ధప్రాతిపదికన తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. జలజీవన్ పథకంలో భాగంగా ఏప్రిల్ 15న నియోజకవర్గంలోని చక్రాయపేట మండలం మినహా మిగిలిన మండలాల ప్రజలకు తాగునీటిని అందిస్తామని పేర్కొన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి ప్రజలకు ఏవైతే అవసరమో వాటిని పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వివేక హత్య కేసును తేల్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వివేక హత్య కేసులో ఉన్న వారికి శిక్ష పడేలా చేస్తామన్నారు. సునీల్ యాదవ్ నిన్న ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో వాస్తవం ఉందన్నారు. అనంతరం దళితవాడలో అనారోగ్యంతో ఉన్న టిడిపి కార్యకర్తను బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, శేషారెడ్డి, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ప్రజాశక్తి - వేంపల్లె

రంజాన్ పండుగలో భాగంగా ముస్లిం సమాజంలో శాంతి, సోదర భావాన్ని సూచిస్తూ నిర్వహించిన ఈద్-ఉల్-ఫితర్‌ను భక్తి శ్రద్ధలతో ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. నెల రోజుల ఉపవాసాల తర్వాత నెలవంక కనపడడంతో రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు జరుపుకున్నారు. వేంపల్లె ఈద్గా సమీపంలో జరిగిన ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక ప్రార్థనలకు కేంద్ర ప్రభుత్వం తీసుకొని వస్తున్న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు అంతా నల్లబ్యాడ్జీలు చేతికి కట్టుకొని హాజరయ్యారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న మర్కస్ మసీదు వద్ద నుండి ముస్లింలు ర్యాలీగా మెయిన్ బజార్ మీదుగా ఉర్దూ ఘర్ షాదీఖానా సమీపంలో ఉన్న ఈద్గా వద్దకు చేరుకున్నారు.

నల్లబ్యాడ్జీలతో ప్రార్థనలు

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు అందరూ నల్ల బ్యాడ్జీలు కట్టుకొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఖాజీ కరీముల్లా మాట్లాడుతూ ముస్లింల మనోభావాలకు విఘాతం కలిగిస్తున్న వక్ఫ్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంటులో గళమెత్తాలని కోరారు. పార్లమెంటులో బిల్లు వెనక్కి తీసుకునే వరకు ముస్లింలు ఐక్యతంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఖాజీపేట : రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. అగ్ర హారంలోని ఈద్గా, టీచర్స్ కాలనీలోని ఈద్గా, దుంపల గట్టులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖాజీపేట పట్టణ ముస్లిం మైనారిటీ నాయకుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ముస్లింలను కలిసి శుభాకాంక్షలు వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ నాయకులు సిద్దారం ఖాదీరుల్లా, కమలాపురం గౌస్ ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ముస్లిం మైనారిటీ నాయకులు సలావుద్దీన్, కెకె బ్రదర్స్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

చాపాడు : రంజాన్ సందర్భంగా సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ చదివి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపు కున్నారు. ఎంపిపి టి.లక్షుమయ్య, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, తహశీల్దార్ రమాకుమారి, ఎంపిడిఒ వీరకిషోర్, ఎస్ఐ చిన్న పెద్దయ్య ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అల్లాడుపల్లెలో ముస్లింలు వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్లని బ్యాడ్జీలు ధరించి ఈద్గాకు వెళ్లారు. వక్ఫ్ బోర్డుపై ప్రభుత్వం తమ నిర్ణయం మార్చుకోవాలని నినదించారు. **మైదుకూరు లో..** మైదుకూరులో ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

చాపాడులో..

ముద్దనూరు : రంజాన్ సందర్భంగా సోమవారం ముస్లింలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఈద్గాలు, మసీదుల వద్ద మత గురువులు, పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ముస్లిం సోదరులు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ చదివి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హిందువులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఈద్గాల వద్ద అర్బన్ సిఐ ఉలసయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ నారాయణ, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

కడప-తాడిపత్రి జాతీయ రహదారి సత్య గ్రీన్ సిటీ వద్ద సోమవారం ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అందించిన సమాచారం మేరకువివరాలు ఇలా ఉన్నాయి.. వల్లూరుకు చెందిన హఫీజ్ వ్యక్తిగత పనిమీద ద్విచక్ర వాహనంలో కడపకు వెళుతుండగా.. కడప నుంచి ఎర్రగుంట్ల వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో హఫీజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన హఫీజ్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని రిమ్స్ వైద్యులు తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రిమ్స్ లో చికిత్స పొందుతున్న హఫీజ్

చెత్త డబ్బాలో ఉన్న వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో పారిశుధ్య పనులపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న పారిశుధ్య పనులపై పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వీరభద్ర మాట్లాడుతూ చెత్తను ప్రతి రోజూ తొలగించాలన్నారు. రంజాన్ పండగ సందర్భంగా ఈద్గా, మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేశామన్నారు. డబ్బాల్లో ఉన్న చెత్తను తొలగించేందుకు కూడా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ హరి, మేస్త్రీ రాము పాల్గొన్నారు.

వీరారెడ్డిని అభినందిస్తున్న మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ఉద్యోగ, పెన్షనర్ల విభాగం పులివెందుల అధ్యక్షుడిగా వీరారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ఉద్యోగులు, పెన్షనర్ విభాగం పులివెందుల నియోజకవర్గం అధ్యక్షుడిగా బండి వీరారెడ్డిని నియమిస్తూ వైసిపి అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వేంపల్లెకు చెందిన మాజీ రిటైర్డ్ ఎంఇఒ వీరారెడ్డి సేవలను పార్టీలో వినియోగించుకునేందుకు ఉగాది పండుగ రోజున వైసిపి ఉద్యోగ, పెన్షనర్ విభాగానికి నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ జగన్ మోహన్‌రెడ్డి నియామక పత్రాన్ని పంపించారు. ఈ సందర్భంగా బండి వీరారెడ్డి మాట్లాడుతూ తనపై పెట్టిన బాధ్యతను వమ్ము చేయకుండా ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలపై పోరాటం చేస్తానని చెప్పారు. తన నియమించినందుకు మాజీ సిఎం వైఎస్ జగన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైసిపి నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పురస్కారం అందుకుంటున్న జర్నలిస్టు సూరిబాబు

సూరిబాబుకు స్వర్ణకలశం ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

సీనియర్ పాత్రికేయులు సూరిబాబు స్వర్ణకలశం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పురస్కారం అందుకున్నారు. హైదరాబాదు చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో మహతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉగాది పురస్కారాల కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బూర్గుల మధుసూదన్ చేతుల మీదుగా అందుకున్నారు. సూరిబాబు 29 ఏళ్లుగా పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీచౌడేశ్వరి మాతపై రూపొందించిన 'అమ్మా.. చూడమ్మా' వీడియో ఆల్బమ్ పాటను ఈనెల 14న ప్రెస్‌క్లబ్‌లో జరిగే కార్యక్రమంలో ఆవిష్కరించనున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఎస్కే డాన్స్ స్టూడియో వారి ఆధ్వర్యంలో మాస్టర్ శ్రావణ్ నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జగన్నాథం మూవీ టీం హీరో రాయలసీమ భరత్, స్కూల్ లైఫ్ మూవీ హీరో అండ్ డైరెక్టర్ పులివెందుల మహేష్, వృషభ మెయిన్ లీడర్ జీవన్‌రెడ్డి, వృషభ సపోర్టింగ్ క్యారెక్టర్ కిట్టు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ బి.వరప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

GENERAL PUBLIC NOTICE

Under instructions from my client Sri Bandaru Chakrapani son of late Bandaru Rama Murthy, aged 45 years, resident of D.No. 14/586, Venugopala Swamy Street, Nakash, Kadapa Town YSR Kadapa Town I give the General public notice.

While my Client remodeling his house bering Door No.14/586, Venugopala Swamy Street, Nakash, Kadapa Town YSR Kadapa Town, he lost the Document No. 4477/1984 dated 30-07- 1984 stands in the name of his mother B. Ramanamma. If anyone found the said document, inform either to my client or to his counsel's address as mentioned below within one week.

B.OBULESU, B.A., B.L.
Advocate,
H.No. 45/85, Chemmumiahpeta,
Kadapa. Mobile No. 83097 69833.

IN THE COURT OF THE HON'BLE II ADDL., JUNIOR CIVIL JUDGE, KADAPA.
O.S. No. 367/2023

Andhra Pragathi Grameena Bank, Represented by its Branch Manager, Kadapa Police Line Branch, Kadapa. **...Petitioner/Plaintiff**

Vs

1) Korrapati Vijay Amruth Raju, S/o. K. Yesuraju, Hindu, aged about 45 years, Business, residing at D.No. 3/1493, Sionpuram, Kadapa city. Now residing at C/o. I.T.I. College,near Gandhi Statue, I.T.I. Circle, Kagithalapenta, Kadapa city.
2) Samanaboyina Venkateswarlu, S/o. S. Venkata Ramana, Hindu, aged about 38 years, Business, residing at D.No. 1/818-A, Yerramukkapalli, Kadapa city.

...Respondents/Defendants

NOTICE TO DEFENDANT No.2

Please take notice that the Hon'ble Court has ordered for notice to the defendant No.2 to appear on 02-04-2025 at 10:30 A.M. in the above Court, failure to appear by you the matter will be decided exparte.

//By Order of the Hon'ble Court//
B. SYAM SUNDER
Advocate for plaintiff,
KADAPA

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.A.No. 115/2020
O.S.No. 56/ 2020

భూమి రెడ్డి నాగవేణి అలియాస్ గోపిరెడ్డి నాగవేణి, భర్త జి.లక్ష్మిరెడ్డి, తండ్రి బి సుబ్బారెడ్డి, వయసు 30 సంవత్సరాలు, డోర్ నెంబర్ 15/555-4, పాండురంగ స్వామి దేవాలయం, పొద్దుటూరు టౌను మరియు మండలం, వైయస్సార్ కడప జిల్లా. **...వాది**

వర్సెస్

బాన కిరణ్ కుమార్ రెడ్డి, తండ్రి బి రామిరెడ్డి, వయసు 46 సంవత్సరాలు, దొమ్మర నంద్యాల గ్రామం, మైలవరం మండలం, వైయస్సార్ కడప జిల్లా. **...ప్రతివాది**

దావా సమను

వాది, ప్రతివాది అయిన మీపై బాగా పరిష్కారాల నిమిత్తం పై కోర్టులో దావా దాఖలు చేసినారు. అట్టి దావాలో మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 05.05.2025 వ తేదీన పైకోర్టులో ఉదయం 10:30 గంటలకు హాజరై తెలుపుకొనవచ్చును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ: 05.05.2025

//బై ది ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
వై. సూర్య పెద్దిరాజు,
అడ్వకేటు,
జమ్మలమడుగు.

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S.No. 221/2020

1. శ్రీమతి మునెమ్మ, భర్త రాఘవరెడ్డి, వయసు 59 సం"లు, ఎర్రగుంటపల్లి గ్రామం, తాడిపత్రి మండలం, అనంతపురం జిల్లా.
2. యమ్. లక్ష్మీదేవి, భర్త మాధవరెడ్డి, వయసు 54 సంవత్సరాలు, డోర్ నెంబర్ 1 - 22, కమ్మర వారి పల్లె గ్రామము, మైలవరం మండలము, కడప జిల్లా.

...వాదులు

వర్సెస్

1. శ్రీమతి రేణుక, భర్త రామిరెడ్డి, వయసు 35 సంవత్సరాలు, మోరగుడి గ్రామం, జమ్మలమడుగు మండలం, వైయస్సార్ కడప జిల్లా.
2. శ్రీమతి శారద, భర్త రామంజుల రెడ్డి, వయసు 32 సంవత్సరాలు, మోరగుడి గ్రామం, జమ్మలమడుగు మండలం, వైయస్సార్ కడప జిల్లా.

...ప్రతివాదులు

దావా సమను

వాది, ప్రతివాది అయిన మీపై భాగపరిష్కారాల నిమిత్తం పై కోర్టులో దావా దాఖలు చేసినారు. అట్టి దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 01.05.2025 తేదీన పై కోర్టులో ఉదయం 10:30 గంటలకు హాజరయ్యి తెలుపుకొనవచ్చును. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేదీ: 01.05.2025

//బై ది ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
వై. సూర్య పెద్దిరాజు,
అడ్వకేటు, జమ్మలమడుగు.

మహారాజ శ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు, నంద్యాల
O.S.NO. 396/2022

సన్నపురాళ్ళపల్లి నాగ లక్ష్మి. ...వాది

V/s.

కామిని శివమ్మ మరియు ఇతరులు. ...ప్రతివాదులు

ప్రతివాది నెం.1 : కామిని శివమ్మ
W/O. కామిని సుబ్బరాయుడు, హిందూ, వయస్సు 65 సం.,
ప్రతివాది నెం.2 : కామిని లక్ష్మి గీత, W/O. పొట్టిపాటి భాస్కర్, హిందూ, వయస్సు 42 సం.,
పై ఇద్దరి చిరునామా R/o. H.No.3/1299, కో-ఆపరేటివ్, కడప టౌన్ మరియు జిల్లా.

ప్రతివాది నెం.1 మరియు 2 కు నోటీసులు

పైన తెలిపిన దావాలో వాది, ప్రతివాదులు అయిన మీ పైన దావా దాఖలు చేసి ఉన్నారు. 1వ మరియు 2వ ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా నోటీసులు ఎన్నిసార్లు పంపినను తీసుకోనందున పై దావా లోని అంశాల పై మీకు ఏదైనా అభ్యంతరాలు ఉన్న యెడల పై కోర్టులో తేదీ 10-04-2025 న ఉదయం 10-30 గంటలకు హాజరై మీరు గాని మీ తరుపు న్యాయవాది గానీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమందు దావా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ : 10-04-2025

ఇట్లు
రావినూతల దుర్గా ప్రసాద్,
రావినూతల విశ్వనాథ్,
అడ్వకేట్స్, నంద్యాల.